# ప్రశ్న

నేను సాయంత్రం నర్సాపూర్ - సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ ఎక్కినప్పటి నుంచీ వాన పడుతోంది. కాని, విజయవాడ చేరుతుండగా అది గాలివానగా మారింది.

కరెంటు పోయిందేమో, పట్టణమంతా అంధకారంలో వుంది. స్టేషన్లో మాత్రం లైట్లు వెలుగుతున్నాయి. న్యూఢిల్లీ వెళ్ళే తమిళనాడు వచ్చేది తెల్లవారుజామున మూడూ నలభైకి - అంటే ఇంకా ఆరు గంటల తర్వాత. అందుచేత సూట్‌కేసు తీసుకుని వెయిటింగ్ రూమ్‌కు దారితీశాను.

వెయిటింగ్ రూములో కూడా ఎక్కువ మంది ప్రయాణీకులు లేరు. నా ఎదురుగా లావుపాటి వ్యక్తి ఒకతను కూర్చుని కునికిపాట్లు పడుతున్నాడు. నా పక్క కుర్చీలో ఓ అమ్మాయి ఏదో పుస్తకం చదువుతూ కూర్చుని వుంది. దూరంగా నలుగురైదుగురు నేల మీద బెడ్డింగు పరచి నిద్రపోతున్నారు.

కొంచెం సేపటికి ఓ ముప్పయ్యేళ్ల యువకుడు చేతిలో చిన్న బ్రీఫ్‌కేస్‌తో లోపలకు వచ్చాడు. జేబు రుమాలు తీసి తల, మొహం తుడుచుకుంటూ అటూ, ఇటూ చూసి నా ఎదురుగా మరో కుర్చీలో కూర్చున్నాడు. కునికిపాట్లు పడుతున్న లావుపాటాయన ఓ సారి అతన్ని ఎగాదిగా చూసి గుర్తుపట్టినట్లుగా లేచి కూర్చుని, "మీరా సార్!" అన్నాడు.

అలా వాళ్లిద్దరూ కబుర్లు ప్రారంభించి ఏవేవో మాట్లాడడం మొదలుపెట్టారు. నేను మగత నిద్రలో ఉండి మొదట వాళ్ల సంభాషణ పట్టించుకోలేదు గాని, నేను అటు దృష్టి సారించేటప్పటికి, యువకుడు లావుపాటాయనతో అంటున్నాడు - "ఒకప్పుడు భూమి చుట్టూ సూర్యుడు తిరుగుతున్నాడనుకునేవారు. కాని, తర్వాత సూర్యుడు భూమి చుట్టూ

తిరగడం లేదనీ, భూమే సూర్యుడి చుట్టూ తిరుగుతోందనీ సైన్సు రుజువు చేసింది. అలాగే చేతబడులూ, బ్లాక్ మాజిక్, అతీంద్రియ శక్తులూ ఉన్నాయని భవిష్యత్తులో సైన్సు రుజువు చేయవచ్చునేమో! ఒక విషయం గురించి ఓపెన్ మైండ్‌తో సైంటిఫిక్‌గా ఆలోచించమంటే తప్పెలా అవుతుందో నాకు అర్థం కావడం లేదు. నా క్రిటిక్స్ ..."

నేను పూర్తిగా తెలివి తెచ్చుకుని వాళ్ల సంభాషణ వినసాగాను. నా పక్కన కూర్చున్న అమ్మాయికూడా చదవటం ఆపుచేసి ఆసక్తిగా అతని మొహంకేసి చూస్తూ, అతను చెప్పే ప్రతిమాటా జాగ్రత్తగా వింటోంది.

వాళ్ల మాటలను బట్టి నాకు అర్థమైనదేమిటంటే ఆ యువకుడు ప్రస్తుతం తెలుగు యువ రచయితల్లో పెద్ద పేరున్న రచయిత. పాఠకులు అభిమానంతో డీ.వీ.పీ. అని పిలుచుకునే దేవీ వరప్రసాద్. అతను చేతబడులూ, అతీంద్రియ శక్తుల గురించి చాలా నవలలు రాశాడట.

నేను తెలుగుదేశం వదలి పాతికేళ్లయింది. ఎప్పుడో రెండు, మూడేళ్లకోసారి ఓ వారం రోజులు సెలవు పెట్టి వెళ్తూండడం వలన తెలుగుదేశంతో దాదాపు సంబంధమేమీ లేనట్లే చెప్పుకోవచ్చు. ఈ పాతికేళ్లలోనూ తెలుగు సాహిత్యంలో వచ్చిన మార్పులతో నాకు అంతగా పరిచయం లేదు. అతను రాసిన పుస్తకాలు నేనేమీ చదవలేదు గాని, అతని పేరు మాత్రం విన్నాను.

"... ఉదాహరణకు నేను స్వయంగా పరిశోధించిన కేసు గురించి చెబుతాను," అంటూ మొదలుపెట్టాడు అతను. "నాలుగైదు సంవత్సరాల క్రితం నేనూ, మరో నలుగురూ స్నేహితులూ ఓ చిన్న పల్లెలో ఓ కేసు పరిశోధించడానికి వెళ్లాం. చాలా విచిత్రమైన కేసు అది. ఓ మధ్య తరగతి కుటుంబంలో పదహారేళ్ల అమ్మాయి వుంది. ఆ అమ్మాయిని మొదట మేనమామ కొడుక్కి యిద్దామనుకున్నారు కాని, వాళ్లు ఆర్థికంగా తక్కువ స్థాయిలో ఉండడంతో ఆ అమ్మాయి తండ్రి వేరే సంబంధం చూసి ఖాయం చేసేశాడు. అందుకని మేనమామ తరఫు వాళ్లు ఆగ్రహించి చేతబడి చేయించారని వీళ్ల అనుమానం."

"ఆ అమ్మాయి పెళ్లి కుదిరినప్పటినుంచీ వింతగా ప్రవర్తించసాగింది. ఆ అమ్మాయి తినే అన్నంలోకి రాళ్లు వచ్చేవి. దణ్ణెం మీద ఆరేసిన బట్టలు, బీరువాలో బట్టలు మండిపోవడం లాంటివి అంతకు ముందు జరిగాయట కాని, మేమున్న రెండు రోజుల్లోనూ ఏం జరగలేదు కనుక వాటిలోని నిజానిజాలగురించి నేనేమీ చెప్పలేను.

"నా స్నేహితులలో ఒకతను సైకియాట్రిస్టు. అతను ఆ అమ్మాయిని చాలా ప్రశ్నలు వేశాడు. తల్లిదండ్రుల్ని ప్రశ్నించాడు. అతను ఏ నిర్ణయానికీ రాలేకపోయాడు.

"మరొకతను ఇంద్రజాలికుడు, పైగా హేతువాది. అతనికి మొదటి నుంచీ ఇలాంటివంటే అపనమ్మకం. ఆ అమ్మాయి తింటున్న అన్నంలోకి రాళ్లెలా వస్తున్నాయో తెలుసుకోవాలని చాలా పట్టుదలగా అతను ప్రతి చిన్న విషయమూ వెయ్యి కళ్లతో చూడసాగాడు.

"మొదటి రోజు మేమందరం చూస్తూండగా, తల్లి అన్నం కలిపి కంచం తీసుకొచ్చి ఆ అమ్మాయిని తినమని బతిమలాడటం మొదలుపెట్టింది. చాలా రోజులుగా తిండి సరిగా లేక ఆ అమ్మాయి ఈనెపుల్లలా అయిపోయింది. ఆ అమ్మాయి 'వద్దు, వద్దు' అంటూనే వుంది. తల్లి బ్రతిమాలుతూ ఓ ముద్ద నోట్లో పెట్టింది. ఆ అమ్మాయి మెల్లగా తినడం మొదలుపెట్టింది. రెండు క్షణాల తర్వాత కటకటమని శబ్దం వినిపించింది. ఆ అమ్మాయి కుంకుడు గింజల సైజులో ఉన్న మూడు గులక రాళ్లు ఉమ్మేస్తూ, మా వెనుక నిలబడ్డ ఎవరో అదృశ్య వ్యక్తిని చూస్తున్నట్లు చూస్తూ "ఓ!" అని పెద్ద కేక పెట్టి కళ్లు తేలేసి విరుచుకు పడిపోయింది.

"మా కందరికీ షాక్ తిన్నట్లనిపించింది కాని, మా 'మెజీషియన్' స్నేహితుడు ఏం మాట్లాడలేదు. మర్నాడు తల్లి అన్నం కలిపి తీసుకొచ్చినప్పుడు అతను హఠాత్తుగా ప్లేటు లాక్కుని అన్నమంతా చేతితో తడిమి చూశాడు. పిచ్చిలో తెలిసో, తెలియకో నోట్లో ముందే రాళ్లు ఉంచుకున్నదేమో నన్న అనుమానంతో ఆ అమ్మాయి నోరు తెరిపించి, నోరంతా చూశాడు. నోట్లో ఏమీ లేదు. ఏడుస్తున్న తల్లిని ఊరుకోమని చెప్పి, అన్నం కలిపి పెట్టమన్నాడు. ఆవిడ పమిట కొంగుతో కళ్లు తుడుచుకుని అన్నం కలపడం మొదలుపెట్టింది.

"తల్లి అన్నం కలిపి పెట్టబోతుంటే ఆ అమ్మాయి 'వద్దు, వద్దు' అని తలెగరేయడం మొదలుపెట్టింది. మా స్నేహితుడు ఆ అమ్మాయి జుట్టు పట్టుకుని 'తిను' అని అరిచాడు గట్టిగా.

"మేమందరం కనురెప్ప వేయకుండా జరిగేది చూస్తున్నాం.

"తల్లి ముద్ద చేసి నోట్లో పెట్టింది. ఆ అమ్మాయి మెల్లగా నమలడం మొదలుపెట్టింది. రెండు క్షణాల తర్వాత మళ్లీ కటకట మని శబ్దం మొదలయింది. ఆ అమ్మాయి నోట్లో గులకరాళ్లు ఎలా వచ్చాయో ఏ సైంటిస్టూ వివరించలేదు.

"మా హేతువాదికి మతిపోయింది.

"నిజం ఏమిటంటే - సైన్సుకి అర్థం కానివీ, హేతువాదానికి అందనివీ సృష్టిలో అనేకం ఉంటాయి. అవన్నీ మూఢ నమ్మకాలని కొట్టి పారేయడం, అన్నీ తెలిసినట్లు వాదించడం శాస్త్రీయ దృక్పథం కాదు. సత్యం అంటే ఆసక్తి ఉన్న వాళ్లు ఓపెన్ మైండ్‌తో ఉండాలి."

ఉరుములు, మెరుపులు, తుపాను వాతావరణంలో అలా మొదలైన ఆ సంభాషణ ఆ తర్వాత సహజంగానే దయ్యాలు, భూతాలు, చేతబడులూ వగైరాల మీదకు మళ్లింది.

● ● ●

లావుపాటాయన 'నా చిన్నప్పుడు...' అంటూ ఓ కథ, 'మా ఊళ్లో ఓ సారి ఏమయిందంటే...' అంటూ ఇంకో కథ చెప్పాడు.

నాకు ఎప్పుడూ అలాంటి అనుభవాలు ఎదురవలేదు గాని, నా చిన్నప్పుడు మా అమ్మ చెప్పిన కొరివి దయ్యాల కథ - మా అమ్మా వాళ్ల ఎడ్లబండిని కొరివి దయ్యాలు తప్పు దారి పట్టించి రాత్రంతా ఎలా తిప్పిందీ - చెప్పాను.

మా సంభాషణ అలా సాగుతుండగా అంతవరకూ మౌనంగా వింటున్న ఆ అమ్మాయి హఠాత్తుగా 'మీరు వింటే నా అనుభవం ఒకటి చెబుతాను' అంది.

అప్పుడు ఆ అమ్మాయిని పరిశీలనగా చూశాను. ఆ అమ్మాయికి ఇరవై, ఇరవై అయిదేళ్లుండవచ్చు. సన్నగా, పొడుగ్గా ఉంది. కోలముఖంలో విశాలమైన కళ్లు చురుకుదనాన్నీ, తెలివితేటల్నీ ప్రతిబింబిస్తున్నాయి. ఆమె నుదుటి మీద కుడివైపు గాయపు మచ్చ వుంది. ఆమె ముంగురులు గాలికి ఎగిరినప్పుడు మచ్చ కొద్దిగా కనిపిస్తోంది.

'చెప్పండి,' అన్నాడు డీవీపీ ఆ అమ్మాయికేసి తిరిగి.

"నేను మీలాగా రచయితను కాదు కనుక ఆసక్తికరంగా చెప్పలేనేమో! నా అనుభవం జరిగింది జరిగినట్లు చెబుతాను. ఇది ఇలా ఎందుకు జరిగిందంటే మాత్రం నేను సమాధానం ఇవ్వలేను. నమ్మడం, నమ్మకపోవడం మీ ఇష్టం' అందా అమ్మాయి.

"మీరు కథ కాదు కదా చెప్పేది - మీ అనుభవం, నమ్మక పోవడానికేముంది? నిజం కల్పన కన్నా వింతగా ఉంటుంది." అన్నాడు డీవీపి.

"నాకు ఊహ తెలిసినప్పటి నుంచీ ఓ కల విడపకుండా వస్తూండేది" ఆ అమ్మాయి చెప్పడం మొదలుపెట్టింది. "ఊహ తెలియక ముందు కూడా అంటే పసితనంలోకూడా ఆ కల బహుశా వస్తూండేదేమో! ఎందుకంటే మా అమ్మ 'నీ చిన్నప్పుడుకూడా కలలో ఉలిక్కిపడి లేచి ఏడ్చేదానివి' అంటూ వుండేది. ఆ కల ఈ ప్రకారంగా ఉండేది - "నేను వర్షంలో తడుస్తూ వెడుతుంటాను. ఓ వీధి మలుపు తిరుగుతాను. అక్కడ తెల్ల ఆవు ఒకటి వానలో తడుస్తూ నిలబడి వుంటుంది. నేను వీధి మలుపు తిరుగుతుంటే అది నా వైపు తలెత్తి చూస్తుంది.

"ఆ వీధిలో రెండు వైపులా పాత పెంకుటిళ్లుంటాయి. వీధి మలుపు తిరిగి నేను నడుస్తూండగా జల్లు పెద్దదవుతుంది. నేను త్వరగా ఇంటికి చేరాలని ఇంకా వేగంగా నడుస్తాను. జల్లు ఇంకా పెద్దదవుతుంది. నేను నీళ్లు కారిపోతూ, ఇక లాభం లేదనుకుని ఓ పెంకుటింటి అరుగు ఎక్కి చూరు క్రింద నిలబడతాను. నా తల మీద నుంచి కారుతున్న నీటిని విదిలించుకుని, బట్టలు పిండుతుంటే ఓ బొంత కాకి అరుగు మీద వాలి రెక్కలు టపటపలాడించి నీరు విదిలించుకుంటుంది.

"ఇంతలో తలుపు తీసుకుని ఓ వృద్ధురాలు బయటకు వస్తుంది. ఆవిడ జేగురు రంగు చీర కట్టుకుని వుంటుంది. ఆవిడ జుట్టంతా నెరిసిపోయి వుంటుంది. ఆవిడ తలుపు తీసి నన్ను చూసి 'అయ్యో అమ్మాయీ! బాగా తడిసిపోయావు లోపలకు రామ్మా!' అంటుంది.

"నేను మొహమాటంగా 'ఫరవాలేదు లెండి! వర్షం తగ్గుతున్నట్లుంది, వెడతాను' అంటాను.

'వర్షం తగ్గాకే వెడుదువుగానీలే! లోపల కూర్చోమ్మా!' అని నన్ను లోపలి గదిలోకి తీసుకువెళ్లి, తుడుచుకోమని టవల్ ఇచ్చి ముసలావిడ లోపలకు వెళ్తుంది.

"ఆ గదిలో ఓ మూల టేబులు, దాని ముందు పాత కాలపు చేతుల కుర్చీ వుంటాయి. టేబులుమీద రాధాకృష్ణుల బొమ్మ వుంటుంది. టవల్‌తో తుడుచుకుంటూ, ఆ గదిలోని ప్రతి వస్తువునూ పరిశీలనగా చూస్తున్న నాలో ఏదో అలజడి మొదలవుతుంది. ఒళ్లంతా తీవ్ర జ్వరం వచ్చినట్లయిపోతుంది. నేనక్కడ నుంచి కదిలి పారిపోవాలనుకుంటాను కాని అడుగు కదల్చలేను. ఆ గది నన్ను వింతగా భయపెడుతున్నా ఆకర్షిస్తున్న మాట కూడా నిజమే.

"అలా భయంతో వణుకుతూ ఎదుటి గోడ వైపు మెల్లగా తలెత్తి చూడటానికి ప్రయత్నిస్తాను. కాని భయంలో తల కదపలేకపోతాను. జ్వరంతో కాగుతున్నట్లున్న శరీరమంతా చెమటతో తడిసిపోతుంది.

"అలా మెల్లగా తలెత్తడానికి ప్రయత్నిస్తుండగా విపరీతమైన భయంతో 'అమ్మా!' అని కేకతో ఒక్కసారి పీడకలలోంచి లేస్తాను."

ఆ అమ్మాయి కథ ఆపుచేసి జేబు రుమాలుతో మొహానికి పట్టిన చెమట తుడుచుకుని మళ్లీ మొదలుపెట్టింది.

"ఇదే కల ఏ మార్పులు లేకుండా మళ్లీ మళ్లీ వచ్చేది. అర్ధరాత్రి వేళ పెద్ద కేక పెట్టి నిద్రలోంచి గజగజ వణుకుతూ లేచేదాన్ని. నన్ను చూసి ఇంట్లో అంతా నవ్వేవారు - 'ఎంత భయమే నీకు!' అని. కాని ఈ కల సంగతి నేను ఎవరికీ, ఎప్పుడూ చెప్పలేదు. తమాషాగా కలలో నా వయసు నాకు తెలిసేది కాదు. చిన్నప్పుడు ఈ కల చాలా ఎక్కువగా వచ్చినా, నేను కాలేజీలో చేరేసరికి అప్పుడప్పుడూ - అంటే ఆరు నెలలకో, సంవత్సరానికో వచ్చేది.

"ఓ సారి కాలేజీనుంచి ఇంటికి వెడుతూ, ఓ స్నేహితురాలి బలవంతం మీద వాళ్లింటికి వెళ్లాను. ఓ అరగంట కూర్చుని తిరిగి ఇంటికి వెడుతూండగా హోరు గాలితో మొదలై ఆకాశమంతా నల్లటి మబ్బులతో నిండిపోయి వాన ప్రారంభమయింది.

"నేను ఆ వీధి మలుపు తిరిగినప్పుడు కాని, నాకు ఆశ్చర్యకరంగా నా కల గుర్తుకురాలేదు. ఎన్నో వందలసార్లు కలలో కనిపించింది ఇప్పుడు నిజంగా జరుగుతోందనే స్పృహ లేదు నాకు. నేను చూరుకింద నిలబడటం, బొంత కాకి రెక్కలు టపటప లాడించటం, జేగురు రంగు చీర కట్టుకున్న వృద్ధురాలు నన్ను లోపలకు రమ్మనడం - అంతా కలలోలాగే జరిగినా నాకు ఇదివరకు ఇదంతా అనుభవంలోకి వచ్చిందేనన్న విషయం తట్టనే లేదు.

"వృద్ధురాలు నన్ను గదిలో కూర్చోబెట్టి లోపలకు వెళ్లిన తర్వాత ఆ గదిలోని వస్తువులన్నీ చూస్తున్న నాకు కలంతా గుర్తుకొచ్చింది. ఆ టేబులు, పాతకాలపు చేతుల కుర్చీ, బల్ల మీద రాధాకృష్ణుల బొమ్మ, నాకు ఎదురుగా గోడ మీద ...

"నాలో విపరీతమైన భయం మొదలయింది. ఒళ్లంతా జ్వరం వచ్చినట్లు కాలిపోసాగింది. కాని ఎదుటి గోడమీద అంత భయం కలిగించే

విశేషం ఏముందో తెలుసుకోవాలన్న ఆసక్తి కూడా ఎక్కువ కాసాగింది. ధైర్యం కూడదీసుకుని మెల్లగా తలెత్తాను ...

"నా కాళ్లు గాలిలో తేలిపోతున్నట్లు నా ఒళ్లంతా ఏదో నిస్సత్తువ ఆవహిస్తున్నట్లు, స్పృహ తప్పుతున్నట్లు అనిపించసాగింది. అయినా మొండిగా తలెత్తి చూసి "శాంతా!" అని కెవ్వున కేకేసి పడిపోయాను.

"తిరిగి స్పృహ వచ్చేసరికి నా తల వృద్ధురాలి ఒళ్లో వుంది. 'ఏమైందమ్మా?' అని అడుగుతోందావిడ.

"ఇంతలో కాఫీ తీసుకుని ఓ నలభై ఏళ్లావిడ - ఆవిడ కోడలు శాంత వచ్చింది. నన్ను ఆ స్థితిలో చూసి, వాళ్లిద్దరూ ఏం చేయాలో తెలియక కంగారు పడిపోయారు. పది నిమిషాల తర్వాత నేను మెల్లగా కుదుటపడ్డాక శాంత ఇచ్చిన కాఫీ తీసుకుని, వాళ్లు ఇంకొంచెం సేపు ఉండమని బలవంతం చేస్తున్నా వినకుండా, థాంక్స్ చెప్పి అప్పటి కప్పుడే రాత్రివేళ ఆ ఇల్లు వదిలాను. ఆ తర్వాత ఆ కల ఎప్పుడూ రాలేదు. ఆ కల అసలు ఎందుకు వచ్చేదో, ఆ తర్వాత ఎందుకు రాలేదో నాకు తెలియదు" అంది ఆ అమ్మాయి.

"గోడమీద మీకు భయం కలిగించేది ఏముంది?" డీపీపీ ప్రశ్నించాడు.

"ఓ పాతికేళ్ల యువకుడి ఫోటో వుంది. దాని కింద - పి.శివరావు జననం 3.9.1940 - మరణం 23.6.1968, అని రాసి వుంది అంతే!"

డీపీపి కాసేపు మౌనంగా ఆలోచిస్తూ ఉండిపోయాడు. తర్వాత - "దాన్నే ప్రీకాగ్నిషన్ అంటారు. ఒక్కోసారి జరగబోయే సంఘటనలు మనకు సంబంధించినవైనా, కాకపోయినా ముందే తెలుస్తుంటాయి,"

అని ప్రారంభించాడు. ఆ తర్వాత సంభాషణ పేరా నార్మల్ ఫినామినా - ఇయస్పీ, క్లెయర్‌వోయెన్సు, టెలిపతీ, సైకోకైనసిస్, సైకిక్ సర్జరీ, ఎస్ట్రల్ ప్రొజక్షన్ వగైరాల మీదకు మళ్లింది. డీపీపీ పేరా సైకాలజీలో ప్రపంచంలో అనేక దేశాల్లో జరుగుతున్న పరిశోధనల గురించి, - ముఖ్యంగా జె.బి.రైన్ పరిశోధన గురించీ, మాట్లాడాడు. బాబాల అద్భుత శక్తుల గురించీ, యూరీ గెల్లర్ సైకిక్ పవర్‌తో తాళంచెవులు వంచడం, ఫోర్కులు విరగ్గొట్టడం, రిస్టువాచీలు టెలిపోర్టుచేయడం గురించి చెప్పాడు.

ఆ అమ్మాయి మాత్రం ఆ తర్వాత మా సంభాషణలో కలుగజేసుకోకుండా మౌనంగా వింటూ కూర్చుంది.

అప్పుడు ఆ అమ్మాయి చెప్పిన కథలో ఒక విషయం హఠాత్తుగా నాకు గుర్తుకు వచ్చింది - "అవునూ, శాంతా అని కేక వేశానన్నావు. శాంత నీకెలా తెలుసు?" అనడిగాను ఆ అమ్మాయి కేసి తిరిగి.

అంతవరకూ డీవీపీకీ ఆ విషయం తట్టనట్లుంది. నేను ఆ ప్రశ్న వెయ్యగానే, "అవును శాంత మీకెలా తెలుసు? మీ కలలో ఆవిడ ఎప్పుడూ రాలేదు కదా!" అనడిగాడు.

"శాంత... శాంత నా భార్య" అంది ఆ అమ్మాయి మెల్లిగా.

"భా.. భా... భార్య..?" డీవీపీ విద్యుద్ఘాతం తగిలినట్లు ఉలిక్కిపడ్డాడు.

"మీరు రీ-ఇంకార్నేషన్ - పునర్జన్మ నమ్ముతారా?" ఆ అమ్మాయి అడిగింది.

"నమ్ముతాననుకుంటాను, నమ్ముతాను." అన్నాడు డీవీపీ అయోమయంగా.

"వి. శివరావు మరణించిన తేదీ, నేను జన్మించిన తేదీ ఒకటే - 23.6.68. వి. శివరావు ఉదయం 9.52 నిముషాలకు కారు ప్రమాదంలో మరణించాడు. 10.30 కు నేను పుట్టాను."

"అంటే ... అంటే?"

"వి. శివరావును నేనే. ఆ వృద్ధురాలు నా తల్లి. శాంత నా భార్య," అంది ఆ అమ్మాయి రుమాలుతో మొహం తుడుచుకుంటూ.

అప్పుడు ఆమె నుదుటిమీద మచ్చ డీవీపీ కంటబడింది.

"అదేమిటి?"

"నా బర్తు మార్కు - ఆత్మకు శరీరం ఉండదంటారు గాని, శివరావు నుదుటి మీద గాయం నా బర్తు మార్కు అవడం ఆశ్చర్యంగా లేదూ?"

"ఆశ్చర్యమే! కాని ఇలాంటి కేసులగురించి నేను చదివాను. ముఖ్యంగా ఏక్సిడెంట్లలో మరణించిన వారి విషయంలో ఇలా జరుగుతుందట! కాని... కాని... "

డీవీపీ మనసులో మెదులుతున్న సందేహం ఆ అమ్మాయికి అర్థమైనట్లుంది. "ఆత్మల్లో మగ ఆత్మ, ఆడ ఆత్మ అని వుండవు కదా!" అంది.

"ఉండ వనుకుంటాను కాని, నేనెప్పుడూ వినలేదు."

"మీరు వినని మూలంగా," వినని మూలంగా అనే మాట ఒత్తి పలుకుతూ అంది ఆ అమ్మాయి - "మీరు వినని మూలంగా మీకు నమ్మటం కష్టంగా ఉంది కాని, అసంభవం కాదు కదా!"

పునర్జన్మ గురించి నేనూ చదివాను, ఎన్నో సినిమాలు చూశాను. కాని ప్రతి సంఘటనలోనూ స్త్రీ స్త్రీ గానూ, పురుషుడు పురుషుడుగానే తిరిగి జన్మెత్తినట్లుంది. ఇంకా పురాణ కథల్లో అయితే కర్మానుసారం జంతువులుగానూ, పక్షులుగానూ జన్మ ఎత్తినట్లు చదివాను కాని మగవాడు ఆడదానిగా కాని, ఆడది మగవాడుగా కాని తిరిగి జన్మించినట్లు ఎక్కడా వినలేదు.

అసలు ఆ అమ్మాయి నిజంగా తన అనుభవం చెప్పిందా, లేక అర్థంపర్థంలేని కథ చెప్పి మమ్మల్ని పరిహాసం చేస్తోందా అనే అనుమానం మా ముగ్గురికీ కలిగింది. డీపీ మొహమైతే కందగడ్డలా ఎర్రగా అయిపోయింది.

"నువ్వు, నిజంగా నీ అనుభవమే చెప్పావా?" ఆ అమ్మాయిని అడిగాను అనుమానంతో.

"నాకు తెలుసు, మీరు నమ్మలేకపోతున్నారు." ఆ అమ్మాయి నొచ్చుకుంటున్నట్లు అంది - "నేను శివరావు ననగానే మీ అందరి మొహాల్లోనూ అపనమ్మకం కనిపించింది. కాని వాస్తవం దాచిపెట్టి మరోలా ఎలా చెప్పను? ఒక క్రమపద్ధతిలో నడిచి, మీకు సంతృప్తి కలిగేలా ముగియడానికి ఇది కథ కాదు కదా! జీవితం. ముందే చెప్పాను. ఇదిలా ఎందుకు జరిగింది, మరోలా ఎందుకు జరగలేదంటే నాదగ్గర సమాధానం లేదని."

మా కెవరికీ ఏమనాలో తెలియలేదు. ఆమె చెప్పిన దాంట్లో అసంభవమేమీ లేదు గాని, ఏదో అస్పష్టమైన అసహజత వుంది. అదేమిటో ఎంత తలలు బద్దలుకొట్టుకున్నా అర్థం కావడం లేదు.

ఇంతలో ఏదో రైలు వస్తున్నట్లు ప్రకటన వినిపించింది. లావుపాటాయన సెలవు తీసుకుని మరో ప్లాట్‌ఫాం మీదకు పరుగు తీశాడు.

డీపీ పరధ్యానంగా జేబులోంచి సిగరెట్టు పేకెట్ తీసి సిగరెట్ వెలిగించి, ఆలోచిస్తూ మా సంగతి మరిచిపోయి ప్లాట్‌ఫాం మీదకు నడిచాడు.

అలా సిగరెట్టు మీద సిగరెట్టు కాలుస్తూ తీవ్రంగా ఆలోచిస్తూ, ప్లాట్‌ఫాం మీద పచార్లు చేస్తున్న అతడ్ని కనురెప్ప వేయకుండా చూస్తున్న ఆ అమ్మాయి కళ్లలో ఓ కొంటె నవ్వు క్షణకాలం పాటు మెరిసి మాయ మయింది. నేను అదే సమయంలో హఠాత్తుగా ఆమె వైపు తిరగడంతో అది నా కంట పడింది. ఆమె కొంచెం తొట్రుపడి సర్దుకుని కూర్చుంటుండగా ఆమె ఒళ్లో పుస్తకం కిందకు జారి పడిపోయింది. ఆ పుస్తకం మీద ఆమె పేరు - 'కె.వి.శ్యామల, ఎం.ఏ. సైకాలజీ' అని రాసి వుంది.

'నీ పేరు శ్యామలా?' అన్నాను ఆమె కేసి సూటిగా చూస్తూ.

'అవును, అంకుల్!'

'ఎం.ఏ. సైకాలజీ చేశావన్నమాట!'

నాకు శ్యామల కథ కొద్ది కొద్దిగా అర్థమవుతోంది. "నువ్వు తలా, తోకా లేని కథతో మమ్మల్ని ఫూల్స్‌ని చేశావు కదూ!"

"కథకు తలా, తోకా ఎందుకు? అడుగడుక్కీ ఒళ్లు జలదరించే బ్రహ్మాండమైన సస్పెన్సుంటే సరిపోదూ! కావలిస్తే క్షురశ్రీగార్నడగండి" అంది శ్యామల పగలబడి నవ్వుతూ.

"క్షురశ్రీ ఎవరు?"

"క్షుద్ర రచయిత శ్రీ - సస్పెన్సు చక్రవర్తి" - అంది శ్యామల ప్లాట్‌ఫాం మీద పచార్లు చేస్తున్న డీవీపీ కేసి చెయ్యి చూపిస్తూ.

నవ్వడం ఆపుచేసి, "అయినా నేను చెప్పింది కట్టు కథ అని మీకు అనుమానం ఎందుకొచ్చింది?" అని అడిగింది.

"అదే... నువ్వు శివరావు ననడం. శాంత నీ భార్య అనడం."

"అంటే.. అంతవరకూ నేను చెప్పేది కట్టు కథ అనే అనుమానం మీకు రాలేదు కదూ?" అంది శ్యామల సీరియస్‌గా.

"అనుమానం రాలేదు."

"డీవీపీ గారూ, రెండో ఆయనా కథలు చెప్పినప్పుడు కూడా మీకు ఏ అనుమానం రాలేదు కదూ! నిజం చెప్పండి."

"ఏ అనుమానం రాలేదు," నిజం ఒప్పుకున్నాను.

"ఎందుకో తెలుసా?" ప్రశ్నించింది శ్యామల.

ఆ అమ్మాయి ఏం చెబుతోందో నాకర్థం కాలేదు, "ఎందుకు?"

"ఎందుకంటే చిన్నప్పటి నుంచి అలాంటివి సంభవమని నమ్మే సమాజంలో, వాతావరణంలో పెరిగి, ప్రశ్నించకుండా నమ్మడానికి అలవాటు పడ్డారు మీరు. ఆత్మ అనేది ఉందనీ, అది కర్మానుసారం అనేక జన్మలెత్తుతుందనే విషయంలో మీకు సందేహం లేదు. కాని, మీ నమ్మకానికి కొంచెం ఎడంగా, మీరు విన్న కథలకు కొంచెం తేడాగా నా కథ వెళ్లేటప్పటికి మీ కనుమానం వచ్చింది."

"అంటే, ఇలాంటి వాటిల్లో విశ్వాసం తప్ప ఏ ఆధారం లేదంటావా?"

"విశ్వాసం తప్ప మరే ఆధారముంది?" శ్యామల ఎదురు ప్రశ్న వేసింది.

"మరి ఇందాక డీవీపీ చెప్పిన కథలో రాళ్లు ఎలా వచ్చాయంటావు? అదీ నమ్మకమేనా?" అన్నాను కొంచెం హేళనగా.

"అది నేనెలా చెప్పేది? పరిశోధించినాయన చెప్పాలి. మన కళ్లు మనల్ని ఎంత తేలిగ్గా తప్పుదారి పట్టిస్తాయో, ఏ మెజీషియన్ ప్రదర్శన చూసినా అర్థమవుతుంది. ప్రపంచాన్నంతా ఒక రకంగా నడిపిస్తున్న ప్రకృతి నియమాలు కొందరి విషయంలో మాత్రం సలాం కొట్టి, సెలవు తీసుకున్నాయని ఎవరైనా అంటే గుడ్డిగా నమ్మక లోపం ఎక్కడుందో వెతకండి అంటూండేవారు మా ప్రొఫెసర్ గారు.

"యూరీ గెల్లర్, బాబా ల్లాంటి వివాదాస్పదమైన వ్యక్తులమీద జరిగే వివాదాస్పదమైన రీసెర్చి పేరా నార్మల్ ఫినామినాని రుజువు చేయలేదు. అతీంద్రియ శక్తులు, అద్భుత శక్తులు వున్నాయనడానికి ఇంతవరకు ఖచ్చితమైన ఆధారాలు ఏమీ లేవు."

"అంటే, ఇవేమీ లేవనే కదా నువ్వు అనేది. ఒక కాలంలో పేరు పొందిన సైంటిస్టులు ఖండించిన తర్వాత ఎన్నో విషయాలు భవిష్యత్తులో శాస్త్రీయంగా రుజువు కావడం చూడటం లేదా? డీవీపీ అన్నట్లు భవిష్యత్తులో నిజం కావచ్చునేమో!"

"కావచ్చు, కాకూడదని నేననలేదే?" అంది శ్యామల నవ్వుతూ.

"మరేమిటంటావు?" అన్నాను నేను ఆశ్చర్యపోయి.

"పేరా నార్మల్ ఫినామినా ఉన్నాయనే విషయంలో డీవీపీకి ఏ సందేహం లేదు. అసలు పేరా నార్మల్ ఫినామినా ఉన్నాయనడానికి

ఇంతవరకు సరైన ఆధారం లేదని నేనంటున్నాను. అదీ మా దృక్పథంలో తేడా! రేపు పరిశోధనల్లో అది రుజువైతే అంగీకరించడానికి నాకు అభ్యంతరం లేదు."

"మాటల గారడీ చేస్తున్నావు."

"మాటల గారడీ కాదు. సైన్సు ఏ విషయాన్నయినా అసాధ్యం, అసంభవం అని ఎలా చెబుతుంది? మంత్రాలకు చింతకాయలు రాలవని మన అనుభవం మనకు చెబుతుంది. కాని రేపు ఎవరయినా మంత్రాలు చదివి, చింతకాయలు రాల్చి, చింతకాయలు కాకతాళీయంగా రాలలేదనీ, మంత్రాలకే రాలాయనీ అసందిగ్ధంగా రుజువు చేస్తే, ఆ మంత్ర శక్తి ఎలా పని చేస్తోందో అర్థమయినా, కాకపోయినా ఆ వాస్తవాన్ని ఏ సైంటిస్టు అయినా ఒప్పుకోక తప్పదు. ఓపెన్ మైండ్‌తో ఉండడమంటే నిరంతరం సత్యాన్వేషణ చేస్తూ, ప్రకృతి గురించి మన జ్ఞానం పెంచుకోవడం కాని, క్షురశ్రీలా చెత్తాచెదారం బుర్ర నిండా పేరుకోనీయడం కాదు!"

శ్యామల మాట్లాడుతుండగా తమిళనాడు వస్తున్నట్లు ప్రకటన వచ్చింది. నేను శ్యామలకు 'గుడ్ బై' చెప్పి నా సూట్‌కేసు తీసుకుని లేచాను.

"అన్నట్లు, బామ్మగారికి ఇంకా కొరివి దయ్యాలు కనిపిస్తున్నాయా? ఎలక్ట్రిక్ లైట్లు, రోడ్లు వచ్చాక ఇప్పుడు కనిపించడం లేదేమో? ఎలక్ట్రిక్ లైట్లంటే కొరివి దయ్యాలకు చచ్చే భయంట!" అంది శ్యామల నవ్వుతూ.

"మా అమ్మని అడిగి చెబుతాలే," అన్నాను నవ్వుతూ.

శ్యామల కథ నేను అప్పుడే మరిచిపోయాను కాని, ఓ ప్రముఖ సంచలన వారపత్రికలో డీవీపీ కథ 'పునరపి జననం' చూడగానే విషయమంతా గుర్తుకు వచ్చింది. ఆయన పరిచయ మవడం వలన పునర్జన్మ గురించి శ్యామలతో సంభాషణ - అన్నీ గుర్తుకు వచ్చి ఆ కథ ఏమిటా అని చూశాను ఆసక్తిగా.

మధ్య పేజీలో రంగుల బొమ్మ - చితి మీద శవం కాలుతున్నట్లు, సుళ్లు తిరుగుతూ పైకి లేస్తున్న పొగ ఆకాశంలో ఎక్కడో గర్భస్థ శిశువుగా రూపం దిద్దుకుంటున్నట్లు - గొప్ప భావస్ఫోరకంగా ఉంది. కథకు పరిచయంలో సంపాదకులు, "మీ అభిమాన సంచలన రచయిత ఈసారి పేరా సైకాలజీ, రీ ఇంకార్నేషన్ మీద అనేక వ్యయ ప్రయాసలకు లోనై, అనేక పరిశోధనలు చేసి రాసిన కథ" అనీ, "నాలుగు పేజీలకు మించని ఓ చిన్న కథ రాయడానికి ఇంత పరిశోధన చేయడం ఈ రచయితకే

చెల్లుతుందనీ," "కథానికా చరిత్రలోనే ఇది అపూర్వ"మనీ రాశారు.

పేరా సైకాలజీలో వివిధ దేశాల్లో జరుగుతున్న పరిశోధనల గురించి, పునర్జన్మమీద బెంగుళూరులో ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్‌లో జరిగిన పరిశోధనలగురించి వివరాలు యిచ్చి పాఠకులకు అటువంటి అనుభవా లేమైనా ఎదురవుతే రాయమనీ, వాళ్ల ఫోటోలతోసహా ఉత్తరాలు ప్రచురిస్తామనీ రాశారు.

డీవీపీ చెయ్యి తిరిగిన రచయిత కాబట్టి శ్యామల కథ ఒళ్లు గగుర్పొడిచేటట్లు రాశాడు. కథంతా అలాగే వుంది కాని, 'శాంత'ను మాత్రం నలభయ్యో పడిలోపడ్డ మగవాడుగా మార్చేశాడు.

అతన్ని చూసి ఏడుస్తూ, "ఏమండీ! నేను మీ విజయనండీ!" అంటుంది విజయ (అంటే వర్షంలో తడిసి వచ్చిన అమ్మాయి) అతని కాళ్ల మీద వాలిపోతూ. అతను గోడ మీద ఉన్న తన భార్య ఫోటో కేసి (శివరావు ఫోటో బదులు విజయ ఫోటో వుంటుంది) పాదాల దగ్గరున్న అమ్మాయి కేసి మార్చి మార్చి చూసి, ఆమెను కాళ్ల మీద నుంచి లేవదీసి గుండెలకు హత్తుకుంటూ "నువ్వు... నువ్వు ఏనాటికైనా తిరిగి వస్తావని నాకు తెలుసు, విజయా! మృత్యువు కూడా మనల్ని విడదీయలేదు" అంటాడు.

శ్యామలలాంటివాళ్లు మాస్ స్టుపిడిటీ అన్నా ఈ కథ ఆంధ్రదేశంలో చాలా సంచలనం కలిగించిందనీ, ముఖ్యంగా పాఠకురాళ్లను అత్యంతంగా ఆకర్షించిందనీ ఉత్తరాల వర్షం చూస్తే వేరే చెప్పనక్కరలేదు. అయితే డీవీపీ శ్యామల కథను యథాతథంగా కాకుండా అలా మార్చి ఎందుకురాశాడో నాకు అర్థం కాలేదు. ఆలోచించగా, ఆలోచించగా ఆయన కథ అలా మార్చడానికి ఒక కారణం కనిపిస్తోంది.

పాపులర్ రైటర్‌గా డీవీపీకి పాఠకుల ఇష్టానిష్టాలు, విశ్వాస అవిశ్వాసాలు గ్రహించే ఇన్‌స్టింక్ట్ వుంది.

శ్యామల కథను యథాతథంగా రాసి పాఠకుల నమ్మకాలకు ఎదురీది వాళ్ల అభిమానం పోగొట్టుకునే మూర్ఖుడు కాడు అతను. తలకిందులుగా ఉన్న శ్యామల కథను 'కాళ్ల మీద' నిలబెట్టి, పాఠకులు ఎటువంటి కథలు నమ్మడానికి అలవాటు పడ్డారో అలా ముగించాడు.

అంటే ... అసలు ఆ కథ సంగతి అలా ఉంచి నిజంగా శ్యామల చెప్పినట్లు దేవుడు, దయ్యం, ఆత్మ, పరమాత్మ, స్వర్గం, నరకం - ఇవన్నీ కేవలం విశ్వాసం మీదే ఆధారపడి ఉన్నాయా? వేల సంవత్సరాల సంస్కృతి మనల్ని నమ్మడానికి కండిషన్ చెయ్యడం వలన మనం ప్రశ్నించకుండా నమ్ముతున్నామే కాని, అంతకు మించి ఏమీ లేదా?

ఈ ప్రశ్న అప్పటినుంచి నన్ను కలవరపెడుతూనే వుంది.

*('ఆంధ్రప్రభ' సచిత్ర వారపత్రిక, డిసెంబరు 2-8-1992, సౌజన్యంతో...)*

★ ★ ★